క్లుప్తంగా

కుల గణన కూడా చేపట్టాలి



తాడేపల్లి రూరల్ : జన గణనతో పాటు కుల గణన కూడా చేపట్టాలని అటల్ జన నేత మైలా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం మంగళగిరి పట్టణ పరిధిలోని ఐబీ ఎన్ భవన్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని 70 శాతం వరకు పెంచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతున్నామన్నారు. చట్ట సభల్లో 37 శాతం రిజర్వేషన్ కల్పించాలని, ఓబీసీ ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, ఓబీసీ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. జాతీయ ఓబీసీ కమిషన్ జస్టిస్ రోహిణి ఆధ్వర్యంలో జాతీయ జన, కుల సర్వే చేపట్టి రాజ్యాంగ బద్ధంగా అమలు చేయాలని కోరారు.

విజయలక్ష్మి ఫైర్ వర్క్స్ మెగా లక్కీ డ్రా

నెహ్రూనగర్: దీపావళి పురస్కరించుకుని చుట్టుగుంటలోని విజయలక్ష్మి ఫైర్ వర్క్స్ ఏర్పాటు చేసి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫైర్ వర్క్స్ అధినేత మలిశెట్టి సుబ్బారావు లక్కీ డ్రా ద్వారా 11 ప్రైజ్‌లు కస్టమర్లకు అందజేశారు. మొదటి ప్రైజ్‌గా హీరో మోటార్ బైక్, రెండోది ఎలక్ట్రానిక్ బైక్, మూడోది ఏసీ, నాలుగోదిగా వాషింగ్‌మిషన్ ఇలా 11 మందికి ప్రైజ్‌లు అందజేశారు.

హైందవ శంఖారావం సభ కరపత్రం ఆవిష్కరణ



గుంటూరు మెడికల్: విజయవాడలో 2025 జనవరి 5న నిర్వహించనున్న హైందవ శంఖారావం భారీ బహిరంగ కరపత్రలను ఆదివారం ఆవిష్కరించారు. సన్నాహక సమావేశం గుంటూరు టీజేపీఎస్ కళాశాలలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ఆర్ఎస్ఎస్ రాష్ట్ర ప్రచారక్ విజయాదిత్య, జిల్లా కన్వీనర్ వంగా జనార్ధన్ రెడ్డి, మాధవరెడ్డి, గోపికృష్ణ వివిధ క్షేత్రాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం బహిరంగ సభ కరపత్రం ఆవిష్కరించారు.

టీటీడీ పాలక వర్గంలో గిరిజనులకు చోటు కల్పించాలి

నెహ్రూనగర్: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలకవర్గంలో గిరిజనులకు చోటు కల్పించాలని గిరిజన విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు పాండునాయక్ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. గత వైఎస్సార్ ప్రభుత్వంలో కూడా గిరిజనులకు పాలకవర్గంలో చోటు కల్పించారని గుర్తు చేశారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం కూటమి ప్రభుత్వం కూడా గిరిజనులకు టీటీడీ పాలకవర్గంలో చోటు కల్పించాలని లేని పక్షంలో హైకోర్టును ఆశ్రయిస్తామని పేర్కొన్నారు.

దేవాలయాల్లో రజకులకు నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలి

నెహ్రూనగర్: రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో రజకులకు నామినేటెడ్ పోస్టులు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జన సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అగ్రవర్ణ పార్టీలు బీసీలను ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నాయే తప్ప రాజ్యాధికారంలో వాటా ఇవ్వడానికి ఇష్టపడడం లేదని చెప్పారు. టీడీపీ అధికారంలోకి రావడానికి 90శాతం రజకులు కష్టపడి పనిచేసిన విషయం ఈ సందర్భంగా గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక పదవులన్నీ డబ్బున్న అగ్రవర్ణాలకి కట్టబెట్టడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. ఇప్పటికైన టీడీపీ ప్రభుత్వం కొత్త వాళ్లకి రెండు ఎమ్మెల్సీలు ఇవ్వాలని, రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పోస్టుల్లో రజకులకు అధిక ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

అలరించిన బ్రహ్మం గారి నాటక ప్రదర్శన



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై ఆదివారం వీరబ్రహ్మేంద్రస్వామి వారి భక్త బృందం బ్రహ్మం గారి నాటకం ప్రదర్శించారు. సూరపనేని శ్రీకాంత్ ఎండోమెంట్ సహకారంతో ప్రదర్శించగా, ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్. మస్తానయ్య, బొల్లేపల్లి సత్యనారాయణ, సూరపనేని శ్రీరామచంద్రమూర్తిచౌదరి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శ్రీరామచంద్రమూర్తిచౌదరి, వీరబ్రహ్మేంద్ర స్వామి వారి భక్త బృందాన్ని సత్కరించారు. వీరబ్రహ్మేంద్రస్వామి కాలజ్ఞానం, భవిష్యత్ ఘటనలను తాళపత్ర నిధి రూపంలో అందించిన వాటిలో కొన్ని ముఖ్య ఘట్టాలను బ్రహ్మం గారి నాటక రూపంలో ప్రదర్శించారు.

సగటు సంపాదన ఉల్లికి సరిపాయే..



చిన్న ఉల్లిపాయల బస్తాలు

- రోజు రోజుకు పెరుగుతున్న పెద్ద ఉల్లిపాయల ధరలు
- మార్కెట్‌లో రూ.70 నుంచి రూ.వందకు విక్రయం
- కొండెక్కిన చిన్న ఉల్లి.. కిలో రూ.400లు
- సగటు మనిషి సంపాదన కూరకే ఖర్చు...
- కిలో రూ.50కు తక్కువ లేని కూరగాయలు



పొలంలో ఉల్లిపాయలు పోస్తున్న రైతు

తాడేపల్లి రూరల్ : ఉల్లిపాయల ధరలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. రిటైల్ మార్కెట్‌లో నాణ్యత ఆధారంగా ఉల్లిపాయ కేజీ రూ.70 నుంచి రూ.80 వరకు విక్రయిస్తున్నారు. దేశంలో అత్యధికంగా మహారాష్ట్ర, నాసిక్, ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలులో ఉల్లి ఉత్పత్తి ఎక్కువగా ఉంది. ఇక్కడి నుంచే దేశంలో ఇతర ప్రాంతాలకు ఉల్లి ఎగుమతులు జరుగుతున్నాయి. ప్రస్తుతం అక్కడ ఉత్పత్తి ఉన్నప్పటికీ సరుకు దొరకడం లేదని, సరుకు రావడం లేదని వ్యాపారులు చెప్తూ రోజుకో ధర నిర్ణయిస్తున్నారు. హోల్ సేల్ మార్కెట్‌లో కొన్న రేటుకు నాణ్యత ఆధారంగా రూ.10 నుంచి రూ.20 వరకు లాభం వేసుకుని వ్యాపారులు విక్రయిస్తున్నారు. రైతు బజారులో కిలో ఉల్లి ధర రూ.70 ఉండగా, బహిరంగ మార్కెట్‌లో నాణ్యతను బట్టి రూ. 80 నుంచి రూ.100 వరకు విక్రయిస్తున్నారు. ఇక చిన్న ఉల్లి అయితే మార్కెట్ ధర కిలో రూ.400 వరకు ఉంది.

వ్యాపారుల మాయాజాలం

నాసిక్, మహారాష్ట్ర ఉల్లిపాయలతో పాటు కర్నూలు ఉల్లిపాయలకు దేశవ్యాప్తంగా డిమాండ్ ఉంది. నాణ్యమైన ఉల్లిపాయల కోసం ఇతర రాష్ట్రాల నుంచి వ్యాపారులు ఉల్లిని దిగుమతి చేసుకుంటున్నారు. విజయవాడ మార్కెట్‌లో ఉల్లి 100 కిలోల బస్తా గరిష్టంగా రూ. 4,100 చేరుతోందని, రవాణా, కూలీ ఖర్చులు కలుపుకుని రూ. 4,600 ఖర్చు అవుతోందని వ్యాపారులు అంటున్నారు. ఇప్పుడు ఉన్నదంతా పాత పంట అని, కొత్త పట జనవరి నుంచి మార్కెట్‌లోకి వస్తుందని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం నెలకొన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు.

నాణ్యత కరువు

అన్నిచోట్ల నాణ్యమైన ఉల్లి లభించడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఒక్కో చోట నాలుగైదు రకాల ఉల్లిపాయలకు విక్రయిస్తున్నారు. హోటళ్లు, మెస్‌లు, కేటరింగ్ వ్యాపారులకు ఒక రకమైన ఉల్లిని ఇచ్చి, చిల్లరగా కొనుగోలు చేసే వారికి రెండో రకం ఉల్లిని అమ్ముతున్నారు. మరి కొందరు రెండు క్వాలిటీలను కలపి విక్రయిస్తున్నారు.

ఉల్లిపాయ లేనిదే వంట లేదు



ఇప్పుడు కార్తీక మాసం. ఈ నెలంతా క్యాటరింగ్ పనులు ఎక్కువగా ఉంటాయి. ఉల్లి, చిన్న ఉల్లి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. గతంలో ఉల్లిరేటు ఒక్కటే పెరిగేది. ఇప్పుడు చిన్న ఉల్లి రేటు కూడా ఎప్పుడూ లేని విధంగా భారీగా పెరిగింది. 10 కేజీల ఉల్లిపాయలు తీసుకుంటే రూ.700లు అవుతోంది. చిన్న ఉల్లిపాయి 2 కేజీలు రూ.1,000లు. వచ్చే లాభం పెరిగిన ఉల్లి, కూరగాయలకు సరిపోతోంది.

– ప్రసాద్, క్యాటరింగ్ నిర్వాహకులు, ఉండవల్లి

అన్ని ధరలు పెరిగాయి



ఉల్లిపాయే కాదు కూరగాయల ధరలు సైతం కిలో రూ. 50కి తక్కువకు లేవు. పప్పులు, నూనెల ధరలు కూడా భారీగా పెరిగాయి. గత 5 నెలలకి ఇప్పటికీ ఒక కుటుంబానికి అవసరమైన నిత్యావసర సరుకులు తీసుకోవాలంటే రూ.1,500లు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. కూలీల రేట్లు మాత్రం అలాగే ఉన్నాయి.

– చింతలచెరువు ఈశ్వరమ్మ, పోలకంపాడు


పేదలకు పచ్చడి మెతుకులే



కూలీనాలీ చేసుకునే వారు పచ్చడి మెతుకులతోనే కాలం గడపాల్సి వస్తోంది. టమాటా, పచ్చిమిర్చి పచ్చడి చేసుకుందామన్నా అవి రెండూ కలిపి తీసుకుంటే అరకిలో రూ.60లు అవుతోంది. సొరకాయ పది రూపాయలు ఉండేది రూ.30లు అయ్యింది. ఇక ఉల్లిపాయలు కొనే పరిస్థితిలో లేదు.

– మాధవి, పోలకంపాడు

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక



తాడేపల్లి రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికను కార్పొరేషన్ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా అన్నారు. ఆదివారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ సోమవారం నుంచి నగరపాలక సంస్థ తాడేపల్లి కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి జరిగే కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు రూపంలో అందజేయాలని చెప్పారు. వాటిని త్వరగా పరిష్కరించేందుకు అన్ని విభాగాలను సమన్వయం చేసి, కృషిచేస్తామని చెప్పారు. ప్రతి సోమవారం ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కొనసాగుతుందన్నారు. కాల్ సెంటర్ 70939 12653, 0864 5295192 నంబర్లకు సమాచారం తెలియజేస్తే, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వినతిపత్రాల కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

తాడేపల్లి రూరల్ : భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పునఃప్రారంభించి, పథకాలు కొనసాగించాలని ఈ నెల 8న తహసీల్దార్లు, లేబర్ కమిషనర్‌లకు సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టనున్న వినతిపత్రాల సమర్పణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని యూనియన్ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి నరసింహారావు ఆదివారం ఒక ప్రకటలో కోరారు. విజయవాడ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలను నిలుపదల చేసినట్లు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం బోర్డును ప్రారంభించి, పథకాలను అమలు చేస్తామని ఇచ్చిన ఎన్నికల హామీని అమలు చేయాలని తెలిపారు. మ్యానిఫెస్టోలో కూడా ప్రకటించి, అధికారంలోకి వచ్చి ఐదు నెలలు కావస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు.

తాడేపల్లిలో ఆస్టర్ రమేష్ హాస్పిటల్ ఓపీ విభాగం



తాడేపల్లిలో ఆస్టర్ రమేష్ హాస్పటల్ క్లినిక్ ప్రారంభిస్తున్న డాక్టర్ పోతినేని రమేష్‌బాబు, సీతారామ మోహనరావు

లబ్బీపేట(విజయవాడతూర్పు): వైద్య రంగంలో మూడున్నర దశాబ్దాలకు పైగా అనుభవంతో విజయవాడ, గుంటూరు, ఒంగోలు, ఏలూరులో ఏడు శాఖల్లో వైద్య సేవలు అందిస్తున్న ఆస్టర్ రమేష్ హాస్పటల్స్ రాజధాని ప్రాంతంలో ఓపీ సేవలు ప్రారంభించింది. తాడేపల్లి సర్వీసు రోడ్డులో ఏర్పాటు చేసిన అవుట్ పేషెంట్స్ విభాగాన్ని ఆదివారం హాస్పటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజధాని ప్రాంత ప్రజలకు అత్యుత్తమ వైద్యం అందించేందుకు ఈ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇక్కడ స్పెషలిస్టు కన్సల్టేషన్‌లతో పాటు ఫార్మసీ, లేబొరేటరీ, ఎక్స్‌రే, ఈసీజీ, ఎకో కార్డియోగ్రామ్, ట్రెడ్ మిల్ టెస్ట్, ఆల్ట్రా సౌండ్, టెలీ మెడిసిన్ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అంతేకాక 5జీ టెక్నాలజీతో ఐసీయూ ఆన్‌వీల్స్ అంబులెన్స్ ద్వారా అత్యవసర వైద్య సేవలు అందించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ చైర్మన్ మద్దిపాటి సీతా రామ మోహనరావు, డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మమత రాయపాటి, గ్రూప్ బిజినెస్ హెడ్ డాక్టర్ వై.కార్తీక్ చౌదరి, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ నాదెళ్ల గిరిబాబు, యూనిట్ హెడ్స్ డాక్టర్ కారుపాటి సుదర్శన్, డాక్టర్ సుమ, డాక్టర్ నితిన్ పాల్గొన్నారు.

జాషువా నగర్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం

తెనాలి: రూరల్ మండల గ్రామం నందివెలుగు జాషువానగర్‌లో కూచిపూడి విజయబాబు మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. తెనాలిలోని చదలవాడ స్కిన్ అండ్ ఐ కేర్ సెంటర్ సౌజన్యంతో ఏర్పాటైన ఉచిత కంటి వైద్య శిబిరంలో డాక్టర్ చదలవాడ ఉమాదేవి, జాషువానగర్‌లోని పిల్లలు, పెద్దలకు కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి శస్త్రచికిత్స, కంటి అద్దాలు, మందులు తమ వైద్యశాలలో ఉచితంగా అందజేస్తామని డాక్టర్ ఉమాదేవి చెప్పారు. కూచిపూడి విజయబాబు మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు, న్యాయవాది కూచిపూడి ప్రసాదరావు మాట్లాడుతూ జాషువానగర్‌లో వైద్య శిబిరం నిర్వహించినందుకు డాక్టర్ చదలవాడ ఉమాదేవి, సిబ్బందిని అభినందించారు. డాక్టర్ ఉమాదేవిని శాలువ, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. సొసైటీ తరపున అందిస్తున్న సేవలను వివరించారు. కమిటీ సభ్యులు కె.రాజేష్, కె.అలీస్, విజయ్‌కుమార్, ప్రభుదాస్, ప్రసూనాంబ పాల్గొన్నారు.

అత్తోటలో ఉచిత వైద్య శిబిరం

పట్టణానికి చెందిన రెయిన్‌బో ట్రస్ట్, రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం సంయుక్త నిర్వహణలో ఆదివారం కొల్లిపర మండల గ్రామం అత్తోట యాదవపాలెంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అక్కడి ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన శిబిరంలో ఒమేగా హాస్పిటల్స్, గుంటూరు ఆధ్వర్యంలో స్త్రీలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, రొమ్ములో గడ్డల పరీక్షలు చేశారు. తెనాలిలోని లతాస్ డయాబెటిక్ కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచితంగా థైరాయిడ్, డయాబెటిక్, ఆర్‌బీఎస్, హెచ్‌బీఏ1సీ పరీక్షలు చేశారు. డాక్టర్ డి.జీవనలత, డాక్టర్ శైలభాను పరీక్షలు చేయగా, రోటరీ క్లబ్ నిర్వాహకులు ఈదర శ్రీనివాసరావు, ఈదర వెంకట పూర్ణచంద్, గుత్తా వెంకటరత్నం, మురళి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కార్తిక వన మహోత్సవం



ఏకో పార్కులో పూర్వ విద్యార్థులకు జ్ఞాపికల బహూకరణ

మంగళగిరి: పట్టణంలోని టెంపుల్ హిల్ ఏకో పార్కులో ఆదివారం పూర్వ విద్యార్థులు కార్తీక వన మహోత్సవం నిర్వహించారు. 1994–1999 మధ్య స్థానిక సీకే స్కూలులో పదవ తరగతి వరకు విద్యను అభ్యసించిన విద్యార్థులు ఒక్క చోట చేరి, చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ ఏడాది మే నెలలో జరిగిన పూర్వవిద్యార్థుల సమ్మేళనం జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రేఖా నరేష్‌బాబు, జంజనం సతీష్, షేక్ చాన్ బాషా, కోలా కిరణ్‌కుమార్,షేక్ సర్దార్ పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

తాడికొండ: ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని లాం గ్రామ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసులు వివరాల మేరకు.. నిడుముక్కల గ్రామానికి చెందిన షేక్ గౌస్(49) ఆదివారం ఉదయం 5 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై గుంటూరు వెళ్తున్నాడు. అమరావతి నుంచి గుంటూరు వైపు వెళ్తున్న ట్రాక్టర్ డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేకులు వెనుక నుంచి బలంగా గౌస్ ఢీకొట్టాడు. గాయపడి రోడ్డుపై పడిపోయాడు. స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా కొడుకు షేక్ రబ్బాని 108 వాహనంలో తండ్రి గౌస్‌ను జీజీహెచ్‌కు తరలించాడు. అప్పటికే అతను చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. రబ్బాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.

దాడి ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు

తాడికొండ: దాడి చేసినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురు కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు తాడికొండ సీఐ కె.వాసు తెలిపారు. వివరాల మేరకు..గత నెల 31న కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంటి ఎదురుగా ఉన్న గంగాల వెంకటేశ్వరరావు, కుమార్‌తో పాటు భార్య హేమలత దాడి చేయగా తనకు కాలు విరిగి ఆపరేషన్ చేసుకున్నానని బాధితుడు హనుమంతరావు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుండెపోటుతో ఆర్ఎంపీ మృతి

మంగళగిరి: యర్రబాలెం ఆర్ఎంపీ వైద్యుడు లక్ష్మయ్య తన నివాసంలో శనివారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు.

నేడు 'డయల్ యువర్ కమిషనర్'

నెహ్రూనగర్: 'డయల్ యువర్ కమిషనర్' కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నగర ప్రజల స్థానిక సమస్యల పరిష్కారానికి ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు 0863-2224202 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)ను కౌన్సిల్ హాల్‌లో మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆటో డ్రైవర్లు మృతి

తెనాలిరూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఆటో డ్రైవర్ మృతి చెందాడు. బాపట్ల జిల్లా వేమూరు పంచాయతీలోని బేతేలు పురంకు చెందిన చాగలమర్రి వినోద్(30) శనివారం తెల్లవారుజామున తెనాలికి తన ఆటోలో వస్తుండగా వైకుంఠపురం వద్ద నిద్రమత్తులో డివైడర్‌కు ఢీకొని ఆటో తిరగబడడంతో తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. మంగళగిరిలోని ప్రయివేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ మేరకు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఆటో డ్రైవర్...

ఆత్మహత్యాయత్నం చేసిన మరో ఆటో డ్రైవర్ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ మారిస్‌పేట సీఎం కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ రాజు(40) కుటుంబ కలహాల నేపథ్యంలో గత నెల 29న పురుగుల మందు తాగాడు. గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. వైద్యశాల నుంచి అందిన సమాచారం మేరకు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోతుల బెడద లేకుండా కార్బైడ్ గన్

- ఆటో డ్రైవర్ వినూత్న ఆవిష్కరణ
- పంటలకు, పండ్ల తోటలకు రక్షణ



గన్ ఉపయోగించే విధానం తెలియజేస్తున్న ఎండీ రఫీ

ఫిరంగిపురం: వరి, జొన్న, సజ్జ వంటి పంటలతో పాటు, జామ, డ్రాగన్ ఫ్రూట్, రేగు వంటి పండ్ల తోటలను నాశనం చేసే పందులు, కోతులు, పక్షుల బెడద లేకుండా ఉండేందుకు ఆటో డ్రైవర్ వినూత్నంగా తక్కువఖర్చుతో కూడిన కార్బైడ్ గన్‌ను తయారీ చేశాడు. కేవలం ప్లాస్టిక్ పైపులు, గ్యాస్ లైటర్, కార్బైడ్ పౌడర్ వంటి వాటితో సుమారు రూ.700ల ఖర్చుతో రైతులకు ఉపయోగపడేలా దీనిని తయారు చేయడం విశేషం. దీని ద్వారా హాని చేయని విధంగా పెద్ద శబ్దం వస్తుంది. దీంతో కోతులు, పక్షులు, పందులు వంటివి పారిపోతున్నాయని ఆటో డ్రైవర్ ఎండీ రఫీ తెలిపారు. ఇప్పటికే అడిగిన కొందరు రైతులకు దీనిని తయారు చేసి ఇచ్చానని, దానిని వాడి ఫలితం ఉండటంతో మరికొందరు తమకు కూడా తయారు చేసి ఇవ్వాలని కోరుతున్నారని చెప్పారు. యడ్లపాడు మండలంలోని సొలస గ్రామంలో ఎంపీపీ(ఏఏ)లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న షేక్.జున్నూసాహెబ్ తనను ప్రోత్సహించి, దీనిని తయారు చేసేందుకు సహకారం అందించినట్లు తెలిపారు. ఇది రైతులకు ఎంతో ఉపయోగకారిగా ఉందన్నారు.

కార్యకర్తలకు నిరంతరం అండగా ఉంటాం

- తప్పుడు కేసులతో వేధిస్తే సహించేది లేదు
- వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ హనుమంతరావు, సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి

మంగళగిరి: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు నిరంతరం అండగా ఉంటామని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం పార్టీ పట్టణాధ్యక్షుడు ఆకురాతి రాజేష్ అధ్యక్షతన పట్టణ కమిటీ కార్యకర్తలు, నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ హనుమంతరావు, సమన్వయకర్త వేమారెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలను తప్పుడు కేసులు పెట్టి వేధిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. కార్యకర్తల కోసం ఎంత దూరమైనా వెళ్తామన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన అనంతరం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులతో ఇబ్బంది పెడుతోందన్నారు. కేసులకు ఎవరూ భయపడొద్దని, పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. కూటమి ప్రభుత్వంపై అనతి కాలంలోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకిత వచ్చిందన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా వైఎస్సార్ సీపీ విజయం తథ్యమన్నారు. పార్టీ కార్యకర్తలకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని పలువురు నాయకులు, కార్యకర్తలు కోరారు. ఆప్కో మాజీ చైర్మన్ చిల్లపల్లి మోహనరావు, సీనియర్ మునగాల మల్లేశ్వరరావు, దామర్ల కుబేరస్వామి, మాజీ కౌన్సిలర్లు మహిళా నాయకులు సంకె సునీత, మల్లవరపు సుధారాణి, కలకోటి స్వరూపారాణి, నాలి వెంకటకృష్ణ, మాబు పాల్గొన్నారు.

పట్టణ గౌడ సంక్షేమ సంఘ కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షుడు కోసూరి చంద్రశేఖర్



కార్యదర్శి రేఖా రామారావు

తాడేపల్లి రూరల్ : మంగళగిరి పట్టణ గౌడ సంక్షేమ సంఘం నూతన కమిటీని ఆదివారం పట్టణ గౌడ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గౌడ నాయకులు మాట్లాడుతూ అధ్యక్షులుగా కోసూర చంద్రశేఖర్, వైస్ ప్రెసిడెంట్‌గా పాగోలు శ్రీనివాసరావు, కార్యదర్శిగా రేఖా రామారావు, జాయింట్ సెక్రటరీగా రేఖా వీర రాఘవులు, ట్రెజరర్‌గా వాకా కృష్ణమోహన్, కార్యవర్గ సభ్యులుగా ఎనుమల మాధవరావు, కోసూరి రవి కుమార్, ఉసిరికాయల ఆదిలక్ష్మి, పంది రామకృష్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని తెలిపారు. గౌడ సంఘం నాయకులు రేఖా సుధాకర్, పాగోలు శ్యామ్ ప్రసాద్, వాకా మంగారావు, వాకా మాధవరావు పాల్గొన్నారు.